ఆంధ్రజ్యోతి ప్రవాస

ప్రవాస

# సింగపూర్లో ఘనంగా భాగవత జయంత్యుత్సవ సంబరాలు



**సింగపూర్:** సింగపూర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా తెలుగు భాగవత ప్రచార సమితి, గణనాలయము సంస్థల వారు 'భాగవత జయంత్యుత్సవం 2019' ఎంతో వైభవంగా నిర్వహించారు. మూడోసారి జరుగుతున్న ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో సింగపూర్‌లోని ప్రవాసులతోపాటు స్థానికులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఫేస్‌బుక్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. దీన్ని 1500 మందికిపైగా భాగవత బంధువులు, అభిమానులు ప్రపంచం నలుమూలలనుంచి వీక్షించారు. సనాతన హిందూ ధర్మానికి తలమానికమైన "శ్రీమద్భాగవతం" గ్రంధంలోని భక్తితత్వం ప్రతిఒక్కరికి ఆదర్శప్రాయం కావాలనే సంకల్పంతో, పోతన తెలుగు భాగవతాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చే ప్రయత్నంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

పిల్లలలో కూడా భాగవత తత్వం పట్ల ఆసక్తి పెంచేవిధంగా వారికి భాగవత ఇతివృత్తానికి సంబంధించిన పద్యాలు, కథల పోటీలను నిర్వహించారు. అలాగే భక్తి పాటలు, పిల్లల పాటలు, కథలు, నృత్యరూపకం, భాగవత పారాయణం వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు. సింగపూర్ వాసులు అనేకమంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమని నిర్వాహకులు అన్నారు. భాగవతంలోని చక్కటి పద్యాలను, కథలను చిన్నారులు చదివి అందరినీ అలరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ ఇక్కడే భోజనాలు చేశారు.

ప్రముఖ వక్త, ఉపనిషత్తులలో పట్టభద్రుడు, ఉమ్మడి తెలుగురాష్ట్రాల మాజీ డీజీపీ డా.కరణం అరవిందరావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తమ అమూల్యమైన ఆధ్యాత్మిక సందేశంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. రుక్మిణీ కళ్యాణానికి ఉన్న ప్రాముఖ్యతనే కాక, అందులో ఎంతటి వేదాంత సారాంశం ఉందోకూడా అందరికీ అర్థమయ్యే రీతిలో చక్కగా విశ్లేషించారు. భాగవత ప్రచార సమితి అంతర్జాతీయ శాఖ అధ్యక్షులు ఊలపల్లి భాస్కర కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రత్నకుమార్, ఇండిక్ అకాడమీ స్థాపకులు హరి కిరణ్, సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు కోటి రెడ్డితోపాటు సింగపూర్‌లో ఉంటున్న భరద్వాజ్, లావణ్య, విద్యాధరి, ఉమాదేవి, వేణు మల్లవరపు, సురేష్ చివుకుల, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

**వీడియో కోసం ఇక్కడ క్లిక్ చేయండి.**